క్లుప్తంగా

హోంమంత్రిపై పచ్చమూకల దాడి దుర్మార్గం

తిరుపతి కల్చరల్: ఎన్నికల పోటీల్లో ప్రజల ఆదరణ కానరాకపోవడంతో ఓటమి భయంతో పచ్చమూకలు హోంమంత్రి తానేటి వనితపై దాడికి పాల్పడడం దుర్మార్గమని వైఎస్ఆర్ సీపీ ఎస్సీ విభాగం రాష్ట్ర కార్యదర్శి మల్లారపు మధు ఒక ప్రకటనలో తెలిపారు. నిత్యం దోపిడీతో పాలించిన చంద్రబాబును ప్రజలు విస్మరించడాన్ని సహించలేక అధికార పార్టీ నేతలపై దాడులకు ఉసిగొల్పడం చేతకానితనానికి నిదర్శమని పేర్కొన్నారు. దుర్మార్గపు పచ్చమూకలు హోం మంత్రిపైనే దాడికి బరితెగించి దాడి చేస్తే ఇక చంద్రబాబు పాలనలో సామాన్యుల పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. విలువలు విస్మరించి ప్రజాస్వామ్యానికి విరుద్ధంగా వ్యవహరిస్తున్న కూటమి ప్రజాగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు.

ఉదయం 5 గంటలకే ఎన్నికల ఏజెంట్లు రావాలి


ఎన్నికల రిటర్నింగ్ అధికారి అదితిసింగ్

తిరుపతి తుడా: ఈ నెల 13వ తేదీ పోలింగ్ రోజున ఉదయం 5గంటలకే అభ్యర్థులు, ఏజెంట్లు చేరుకోవాలని తిరుపతి నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి అదితిసింగ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పోలింగ్ ఏజెంట్ అదే పోలింగ్ స్టేషన్ లేదా పక్కన ఉన్న పోలింగ్ స్టేషన్‌లో ఓటర్లై ఉండాలని తెలిపారు. తిరుపతి అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో పోలింగ్ ఏజెంట్‌ను నియమించడంలో ఇబ్బంది ఏర్పడితే, పోలింగ్ ఏజెంట్ తప్పనిసరిగా ఎపిక్ కార్డ్ లేదా ఎన్నికల కమిషన్ సూచించిన ఏదైనా ఇతర ప్రత్యామ్నాయ పత్రాన్ని కలిగి ఉండాలని తెలిపారు. పోలింగ్ ఏజెంట్ తన ఫొటోను అతికించి ఫారం-10లో ఒరిజినల్ నియామక పత్రాన్ని తీసుకురావాలన్నారు. ఏజెంట్లు పెన్ను, పేపర్, పెన్సిల్ అలానే ఆ పోలింగ్ స్టేషన్ తాజా ఎలక్టోరల్ రోల్ కాపీని తీసుకురావాలని తెలిపారు.

గుర్తింపు కార్డు తప్పనిసరి

ఓటు వేసేందుకు వచ్చే ఓటర్లు తమ వెంట ఓటర్ గుర్తింపు కార్డు, జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం జాబ్ కార్డు, ఆరోగ్య బీమా స్మార్ట్ కార్డు, పాన్ కార్డు, పాస్ పోర్టు, సర్వీస్ గుర్తింపు కార్డు, వికలాంగుల గుర్తింపు కార్డు, ఆధార్ కార్డు, బ్యాంక్ పాస్ బుక్, డ్రైవింగ్ లైసెన్స్, స్మార్ట్ కార్డు(రిజిస్ట్రార్ జనరల్ జారీ చేయబడినది), పింఛన్ ధ్రువీకరణ పత్రం, ఉద్యోగి గుర్తింపు కార్డులలో ఏదో ఒకటి తప్పక తీసుకు రావాలని రిటర్నింగ్ అధికారి అదితిసింగ్ కోరారు.

మాక్ పోల్ నిర్వహణ

పోలింగ్ రోజున ఉదయం 05.30 గంటలకు మాక్ పోల్ చేపడుతామని ఆమె తెలిపారు. ఈ నేపథ్యంలో పోలింగ్ ఏజెంట్లు ఉదయం 5గంటలకే పోలింగ్ కేంద్రాలు చేరుకుని రిపోర్ట్ చేయాలని చెప్పారు. ఏజెంట్లు సకాలంలో హాజరు కానప్పటికీ పీఓలు మాక్ పోల్ నిర్వహిస్తారని స్పష్టం చేశారు.

శ్రీవారి సేవలో సీనియర్ ఐఏఎస్ అధికారి


ఆలయం ఎదుట ఏకే సింఘాల్

తిరుమల: తిరుమల శ్రీవారిని గురువారం సీనియర్ ఐఏఎస్ అధికారి అనిల్‌కుమార్ సింగాల్ దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ అధికారులు ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. శ్రీవారి దర్శనానంతరం ఆలయ రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనాలు అందించగా.. టీటీడీ అధికారులు ఘనంగా లడ్డూ ప్రసాదాలతో సత్కరించారు.

ఉపాధి హామీ పనులు పరిశీలన

పాకాల: గాదంకి పంచాయతీలో జరుగుతున్న ఎన్ఆర్ఈజీఎస్ పనులను పీడీ శ్రీనివాసప్రసాద్ పరిశీలించారు. ఈ సందర్భంగా గురువారం పంచాయతీలో చేపట్టిన మామిడి మొక్కల పెంపకం, కాలువల్లో పూడికతీత పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎండలు ఎక్కువగా ఉన్నాయని, కూలీలు తగు జాగ్రత్తలు తీసుకోవాలని పేర్కొన్నారు. ప్రతీ రోజు కూలీలకు రూ.300 తగ్గకుండా వస్తుందని వివరించారు. గ్రామాల్లో ఉపాధి హామీ కూలీల సంఖ్య పెంచాలని, క్షేత్ర సహాయకులు విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని పేర్కొన్నారు. ఏపీఓ కళ్యాణి, టీఏలు గీత, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నెంబర్ వన్ సిటీగా తిరుపతిని తీర్చిదిద్దుతా..

- నూతన సాఫ్ట్‌వేర్ లాంటి వాడిని డౌన్‌లోడ్ చేసుకోండి
- అభివృద్ధిని అడ్డుకునేందుకు కుట్రలు చేశారు
- మీ కుటుంబలోని మనిషిని.. నగరంలో ప్రతి గల్లీలో తిరిగాను
- స్థానిక యువత కోసం ఐటీ హబ్
- 22ఏనుంచి 7500మందికి ఉపశమనం కల్పించాం
- 20మాస్టర్ ప్లాన్ రోడ్లు, ఫ్రీలెఫ్టులు, కనెక్టివిటీ రోడ్లతో ట్రాఫిక్ సమస్యకు చెక్
- మరింత అభివృద్ధి కోసం ఫ్యాన్ గుర్తుకు ఓటేయండి
- వైఎస్ఆర్ సీపీ తిరుపతి ఎమ్మెల్యే అభ్యర్థి భూమన అభినయ్


బహిరంగ సభకు హాజరైన భారీ జన సందోహాన్ని ఉద్దేశించి మాట్లాడుతున్న వైఎస్ఆర్ సీపీ తిరుపతి ఎమ్మెల్యే అభ్యర్థి భూమన అభినయ్

తిరుపతి సిటీ: తిరుపతి నగరాన్ని దేశంలోనే నెంబర్ వన్ సిటీగా తీర్చిదిద్దేంత వరకు నిద్రపోనని వైఎస్ఆర్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి భూమన అభినయ్ హామీ ఇచ్చారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా స్థానిక గ్రూప్ థియేటర్స్ వద్ద ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభలో టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి, ఎంపీ అభ్యర్థి ఎం.గురుమూర్తితో కలసి ఆయన సభకు హాజరైన జనసంద్రాన్నుద్దేశించి ప్రసంగించారు. తిరుపతిలోనే పుట్టి, పెరిగానని, తుది శ్వాస వరకు ప్రజలకు సేవ చేస్తానన్నారు. డిప్యూటీ మేయర్‌గా రెండేళ్లలో తిరుపతి రూపురేకలు మార్చగలిగానన్నారు. తాను నూతన సాఫ్ట్‌వేర్‌లాంటి వాడినని మే 13న నగర ప్రజలు తనను డౌన్‌లోడ్ చేసుకోవాలని అభ్యర్థించారు. స్థానిక యువత కోసం తిరుపతి ఐటీ హబ్‌గా మార్చి పెద్ద ఎత్తున పరిశ్రమలు తీసుకువచ్చి ఉద్యోగావకాశాలు కల్పిస్తానన్నారు. కొర్లగుంట రోడ్డుతో మొదలు పెట్టి నగరంలో 20 మాస్టర్ ప్లాన్ రోడ్లు వేశామన్నారు. ట్రాఫిక్ సమస్యలను నివారించేందుకు స్లిప్ వేస్, ఫ్రీ లెఫ్టులు అభివృద్ధి చేశామన్నారు. 22ఏ కింద ఉన్న భూములపై నిషేధాన్ని ఎత్తేసి 7,500 మంది ఇళ్ల స్థలాలకు భద్రత కల్పించామన్నారు. ప్రజల ఆశీస్సులతో రానున్న ఎన్నికల్లో గెలుస్తానని, నగరాన్ని మరింత అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. సీఎం జగన్‌తోనే రాష్ట్రంలో సామాజిక న్యాయం సాధ్యమన్నారు. అంతకముందు నగరంలోని కొర్లగుంట, డీబీఆర్‌రోడ్డు, వినాయకనగర్, తిమ్మినాయుడుపాళెం, సీతమ్మ మార్గం, ఎంఆర్‌పల్లి, చెన్నారెడ్డికాలనీ, ఖాదీకాలనీ, గ్రూప్ థియేటర్స్, భవానీనగర్ , రైల్వే అండర్ బ్రిడ్జ్ అంటూ అభివృద్ధి చేసి ప్రాంతాల పేర్లను గుక్కతిప్పుకోకుండా చెబుతుంటే ప్రజలు కేరింతలు కొట్టారు. అనంతరం మేయర్ డాక్టర్ శిరీష మాట్లాడుతూ ఐదేళ్లలో తిరుపతికి సీఎం జగనన్న చేసిన సంక్షేమం, అభివృద్ధికి కృతజ్ఞత చెప్పే సమయం ఆసన్నమైందన్నారు. రానున్న ఎన్నికలలో తిరుపతి ఎమ్మెల్యేగా అభినయ్‌ని, ఎంపీగా గురుమూర్తిని ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి గెలిపించాలన్నారు. ఒక బీసీ మహిళ అయిన తనను నగర తొలి మేయర్‌గా ఎంపిక చేయడంతో బీసీలపై భూమన కుటుంబానికి ఉన్న అభిమానం తెలుస్తోందన్నారు. యాదవ సామాజిక వర్గానికి మరింత మేలు జరగాలంటే ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించారు. ఈ సభకు పెద్ద సంఖ్యలో కార్పొరేటర్లు, కోఆప్షన్‌సభ్యులు, వార్డు అధ్యక్షులు, వైఎస్ఆర్ సీపీ నాయకులు, వేలాది మంది నగరప్రజలు హాజరయ్యారు.


జన సంద్రంలో వైఎస్ఆర్ సీపీ జెండా రెపరెపలు


అభినయ్ అభివాదంతో కేరింతలు కొడుతున్న సభికులు

మార్మోగిన జై జగన్నినాదం

తిరుపతి మంగళం: సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో భాగంగా వైఎస్ఆర్ సీపీ గురువారం సాయంత్రం తిరుపతి గ్రూప్ థియేటర్స్ వద్ద నిర్వహించిన బహిరంగ సభ జనసంద్రంగా మారిపోయింది. తిరుపతి నలుమూలల నుంచి 25 వేల మందికి పైగా సభకు పోటెత్తారు. ఎటు చూసినా జనమే.. ఇసుకేస్తే రాలనంతగా జనం భారీ బహిరంగ సభకు చేరుకున్నారు. గాంధీ రోడ్డు, తుడా రోడ్డు, తిలక్ రోడ్డు, కొర్లగుంట, తిరుచానూరు వైపు నుంచి భారీ ప్రదర్శనగా విచ్చేశారు. దీంతో నగర రోడ్లు జనప్రవాహాన్ని తలపించాయి. జై జగన్నినాదాలతో తిరుపతి మార్మోగింది. వైఎస్ఆర్ సీపీ నగర అధ్యక్షుడు పాలగిరి ప్రతాప్‌రెడ్డి అధ్యక్షత వహించిన ఈ సభకు తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేశారు. బహిరంగ సభకు విచ్చేసిన అశేష జనాన్ని ఉద్దేశించి టీటీడీ చైర్మన్, తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి, తిరుపతి ఎమ్మెల్యే అభ్యర్థి భూమన అభినయ్, ఎంపీ అభ్యర్థి గురుమూర్తి, నగర మేయర్ శిరీష ప్రసంగాలు నగర ప్రజల్లో మరింత జోష్ నింపాయి.

ఆరిపోయే దీపం ఆరణి...



జనసేన అభ్యర్థిగా తిరుపతిలో పోటీ చేస్తున్న ఆరణి శ్రీనివాసులు ఆరిపోయే దీపం. చిత్తూరు నుంచి దిగుమతి అయిన ఆరణి శ్రీనివాసులు తిరుపతి ప్రజలు ఛీదరించుకోవడం తప్ప ఆదరించే ప్రసక్తే లేదు. తిరుపతిని ఇంతగా అభివృద్ధి చేసిన అభినయ్‌ని నగర ప్రజలంతా స్వాగతిస్తున్నారు. డబ్బు అహంకారంతో కార్పొరేటర్లకు గాలం వేసి సంతలో పశువుల్లా కొంటున్న ఆరణికి ప్రజలే బుద్ధి చెబుతారు. తిరుపతి ప్రజలంతా భూమన కుటుంబ సభ్యులమే. తిరుపతిలో అభినయ్‌ని గెలిపించుకునేందుకు నగర ప్రజలంతా సిద్ధం.

– ఎస్‌కే బాబు, తిరుపతి కార్పొరేషన్ స్టాండింగ్ కమిటీ సభ్యులు

పేదలకు పెత్తందార్లకు మధ్య యుద్ధం



డిప్యూటీ మేయర్ హోదాలోనే తిరుపతిని ఆదర్శ నగరంగా తీర్చిదిద్దిన భూమన అభినయ్ ఎమ్మెల్యేగా గెలిపిస్తే మరింత అభివృద్ధి చేయగల సమర్థుడు. కూటమిని కూకటివేళ్లతో ముస్లింలంతా కలసి కట్టుగా పెకలించి వేస్తాం. తిరుపతిలో భూమన కుటుంబానికే ముస్లింలంతా మద్దతు. తిరుపతి మరింత అభివృద్ధి జరగాలంటే అభినయ్‌ని ఎమ్మెల్యేగా గెలిపించుకోవడంతోనే సాధ్యమవుతుంది. ముస్లింలంతా అభినయ్‌కే మద్దతుగా ఉండి గెలిపించుకుంటాం.

– సయ్యద్ షఫీ అహ్మద్ ఖాదరీ, ముస్లిం నాయకుడు

కులాన్ని కాదు.. అభివృద్ధిని గెలిపిద్దాం...



తిరుపతిలో కులాలను అడ్డం పెట్టుకుని రాజకీయం చేసే నాయకులకు ఈ సార్వత్రిక ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పాలి. కులం చూసి గతంలో అనేక సార్లు ఓట్లు వేసి గెలిపించిన మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ కుటుంబం తిరుపతి అభివృద్ధికి గానీ, ప్రజల సంక్షేమానికి గానీ ఏమైనా చేశారా... ఈ ఎన్నికల్లో కులాన్ని చూసి కాకుండా తిరుపతిలో జరిగిన అభివృద్ధిని చూసి బలిజలతోపాటు నగర ప్రజలంతా అభినయ్‌కి ఓట్లు వేసి గెలిపించుకుందాం. తిరుపతిలో బలిజలకు ఉన్నత స్థానం కల్పించడంతోపాటు బలిజ భవన నిర్మాణానికి పూర్తి సహకారం అందించిన గొప్ప నాయకుడు భూమన కరుణాకరరెడ్డి. – నీలం బాలాజీ, బలిజ జేఏసీ కన్వీనర్

గోడ దుడ్డు దొంగ ఆరణి



ఆరణి సొంత చిన్నాన్న కమర్షియల్ ట్యాక్స్ ఆఫీసర్‌గా ఉండి సంపాదించిన డబ్బులను గోడలో దాచుకునే అలవాటు. ఆ విషయాన్ని పసిగట్టిన ఆరణి శ్రీనివాసులు గోడ బద్దలుకొట్టి అందులోని డబ్బులను తీసుకుని పారిపోయాడు. ఆ గోడ దుడ్డు దొంగే ఈ ఆరణి శ్రీనివాసులు. ఎనిమిది సంవత్సరాల తర్వాత తిరిగి చిత్తూరుకు వచ్చి అవినీతి, అక్రమ వ్యాపారాలు చేసి కోట్లు గడించాడు. అలా దోచుకున్న డబ్బులతో తిరుపతి కార్పొరేటర్లు, నాయకులను కొనాలని చూస్తావా? ఆరణి శ్రీనివాసులు ఖబడ్దార్. భూమన సైన్యం పెట్టుకోకు. – ఆరె అజయ్‌కుమార్, యువజన నాయకుడు

ఆరోగ్య ప్రదాత సీఎం జగన్



తిరుపతి 27వ డివిజన్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న మేయర్ శిరీష, ఆసుపత్రులలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న డాక్టర్ మునిశేఖర్

- ఎన్నికల ప్రచారంలో మేయర్ శిరీష, డాక్టర్ మునిశేఖర్

తిరుపతి మంగళం: ప్రతి పేదవాడికి కార్పొరేట్ వైద్యం అందించాలని సంకల్పించి ఆరోగ్యశ్రీ పథకాన్ని ప్రవేశపెట్టిన మహానుభావుడు, దివంగత నేత డాక్టర్ వైఎస్. రాజశేఖరరెడ్డి అని తిరుపతి కార్పొరేషన్ మేయర్ డాక్టర్ శిరీష, ఆమె భర్త డాక్టర్ మునిశేఖర్ తెలిపారు. తండ్రికి తగ్గ తనయుడిగా తండ్రి ఆశయాలను కొనసాగిస్తూ ఆరోగ్య ప్రదాతగా రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి పేరుగాంచారన్నారు. తిరుపతి 27వ డివిజన్‌లో మేయర్ శిరీష ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వహించగా, నగరంలోని ఆసుపత్రులలో గురువారం భూమన అభినయ్ గెలుపు కోసం డాక్టర్లతో కలిసి మునిశేఖర్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రతి పేదవాడికి అనేక సంక్షేమ పథకాలను అందించి, వారి జీవితాలకు నేనున్నానంటూ భరోసా కల్పించి పేదల గుండె చప్పుడుగా మారిన మహోన్నత వ్యక్తి జగన్‌మోహన్‌రెడ్డి అని వారు కొనియాడారు. అలాంటి గొప్ప నాయకుడిని మళ్లీ సీఎంగా చేసుకోవాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందన్నారు. తిరుపతి రాజకీయ చరిత్రలో ఎవ్వరికీ సాధ్యం కాని విధంగా తిరుపతిని అభివృద్ధి చేసి భూమన అభినయ్ నగర ప్రజల గుండెల్లో స్థానం సంపాదించుకున్నారన్నారు. అభినయ్ ఎమ్మెల్యేగా ఉంటే తిరుపతి అభివృద్ధిని మరో 40 ఏళ్లు ముందుకు తీసుకుపోతారన్నారు.

ప్రజలే స్టార్ క్యాంపెయినర్లు


వైఎస్ఆర్ సీపీ ప్రజలే స్టార్ క్యాంపయినర్లు కార్యక్రమంలో 40వ డివిజన్ అంబేడ్కర్ కాలనీలో ప్రభుత్వం నుంచి పథకాలు పొందిన లబ్ధిదారులు ప్రచారం చేపట్టారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు ప్రజలే మా స్టార్ క్యాంపయినర్లు అని చెప్పడంతో జేసీఎస్ అధ్యక్షుడు బాలిశెట్టి కిషోర్ వైఎస్ఆర్ సీపీ నేతలతో కలిసి ఇంటింటికీ ప్రభుత్వ స్టిక్కర్లు అంటించి వారితో ప్రచారం చేయించారు. - సాక్షి ఫొటోగ్రాఫర్, తిరుపతి

నీడ జాడేది?



ప్రతి ఏడాది రెండు రోజులు మన నీడ మనకు కనిపించకుండా మాయమవుతుంది సూర్యుడు సరిగ్గా నెత్తిపై ఉంటే నిటారుగా ఉంటే మనిషి, జంతువు లేదా వస్తువు నీడ కనిపించదు. ఈ శూన్య నీడ గురు వారం రోజు మధ్యాహ్నం 12 గంటలకు 2, 3 నిమిషాలపాటు కనిపించింది. - సాక్షి ఫొటోగ్రాఫర్, తిరుపతి

దొంగలే దొంగ.. దొంగ అన్నట్టుంది

- తిరుపతిలో బాబు, పవన్ అరుపులు


మాట్లాడుతున్న బొమ్మగుంట రవి

తిరుపతి కల్చరల్: వెన్నుపోటు రాజకీయాల్లో నేర్పరి చంద్రబాబు, స్వలాభాపేక్ష కోసం రాజకీయం నడిపే పవన్ కల్యాణ్ రుపతిలో దొంగలు పడ్డారు అంటూ ఎమ్మెల్యే భూమనపై నిందారోపణలకు దిగడం చూస్తే దొంగలే... దొంగ... దొంగ అన్నట్టుందని వైఎస్ఆర్ సీపీ నాయకుడు బొమ్మగుంట రవి ఎద్దేవా చేశారు. గురువారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడారు. బాబు, పవన్ తప్పులను ఇతరులపై రుద్ది ప్రజల్ని మభ్య పెట్టే ప్రయత్నం చేయడం దుర్మార్గమన్నారు. గతంలో మోదీతో జతకట్టిన వీరు ఇదే తిరుపతి బహిరంగ సభలో మోదీ రాష్ట్రానికి ప్రత్యేక హోదా పదేళ్లు కాదు 15 ఏళ్లు ఇస్తానన్న హామీ ఇచ్చింది వాస్తవం కాదా అని ప్రశ్నించారు. ఆ హామీ నెరవేర్చని అదే మోదీతో జతకట్టి మరో మారు కుట్రపూరిత మాటలతో దగా చేసే ప్రయత్నం బాబు, పవన్ చేయడం సిగ్గుచేటన్నారు. అధికారం చేపట్టిన ఐదేళ్లలో ఇచ్చిన హామీలు నెరవేర్చి ప్రజా మద్దతు కోరుతున్న సంక్షేమ సారథి ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి అని తెలిపారు. గత రెండేళ్లలో ప్రజల అభ్యున్నతిని కాంక్షిస్తూ శరవేంగా అభివృద్ధి చేసి చూపి ప్రజా మద్దతు కోరుతున్న చరిత్ర భూమన కుటుంబదేనన్నారు. సంక్షేమాన్ని, అభివృద్ధిని కాంక్షించే భూమన అభినయ్‌కి ప్రజలు అండగా నిలిచి విజయంలో భాగస్వాములవుతారని తెలిపారు. ఈ సమావేశంలో చెంగల్‌రాయులు, వంశీ, సుబ్రమణ్యం, లోక, క్రిష్ణమూర్తి, కుమారి పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఉపాధి హామీ పనులు పరిశీలన



ఉపాధి హామీ పనులను పరిశీలిస్తున్న పీడీ శ్రీనివాసప్రసాద్

పాకాల: గాదంకి పంచాయతీలో జరగుతున్న ఎన్‌ఆర్‌ఈజీఎస్ పనులను పీడీ శ్రీనివాసప్రసాద్ పరిశీలించారు. ఈ సందర్భంగా గురువారం పంచాయతీలో చేపట్టిన మామిడి మొక్కల పెంపకం, కాలువల్లో పూడికతీత పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎండలు ఎక్కువగా ఉన్నాయని, కూలీలు తగు జాగ్రత్తలు తీసుకోవాలని పేర్కొన్నారు. ప్రతీ రోజు కూలీలకు రూ.300 తగ్గకుండా వస్తుందని వివరించారు. గ్రామాల్లో ఉపాధి హామీ కూలీల సంఖ్య పెంచాలని, క్షేత్ర సహాయకులు విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని పేర్కొన్నారు. ఏపీఓ కళ్యాణి, టీఏలు గీత, బాలకృష్ణ పాల్గొన్నారు.

పోలీసుల చేతివాటం?

- ఓటర్లను ప్రలోభాలకు గురి చేస్తూ నగదు పంపిణీ చేసిన టీడీపీ నేతలు
- నగదును పట్టుకున్న డ్యూటీ పోలీసులు
- ఆపై టీడీపీ నేతలతో సెటిల్‌మెంట్ చేసుకున్నట్లు సమాచారం

చంద్రగిరి: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఓటర్లను ప్రలోభాలకు గురి చేయకుండా ఎలక్షన్ కమిషన్ అన్ని విధాలుగా కట్టుదిట్టమైన చర్యలను తీసుకుంటోంది. ప్రధానంగా ఎక్కడా నగదు పంపిణీకి అవకాశం ఇవ్వకుండా పోలీసు శాఖను సమన్వయం చేసుకుంటూ అడ్డుకట్ట వేస్తోంది. సోమవారం జరిగే సార్వత్రిక ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు ముమ్మరంగా నిర్వహిస్తోంది. ఈ క్రమంలో నిష్పక్షపాతంగా విధులు నిర్వహించాల్సిన కొంత మంది పోలీసులు చేతవాటాన్ని ప్రదర్శిస్తున్నారు. గురువారం సాయంత్రం మండల పరిధిలోని ఏ.రంగంపేట గ్రామంలో టీడీపీ నేతలు ఓటర్లను ప్రభావితం చేస్తూ నగదు పంపిణీ చేస్తున్నారు. నగదు పంపిణీ విషయం తెలుసుకున్న డ్యూటీ పోలీసులు ఘటన స్థలానికి చేరుకున్నారు. పంపిణీకి సంబంధించిన ఫొటోలు, వీడియోలను తీసుకున్నట్లు సమాచారం. దీంతో అప్రమత్తమైన టీడీపీ నాయకులు అక్కడ నుంచి పారిపోగా మరికొంత మందిని అదుపులోకి తీసుకున్నట్లు స్థానికులు చెబుతున్నారు. వారి వద్ద రూ.2 లక్షల నగదు అధికారులు గుర్తించినట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో టీడీపీ నాయకులు నగదు భారీగా అధికారులకు ఆఫర్ చేయడంతో, పోలీసులు చేతివాటాన్ని ప్రదర్శించినట్లు ఎ.రంగంపేటలో జోరుగా ప్రచారం సాగుతోంది. దీంతో టీడీపీ నాయకులు ఇచ్చిన నగదు జేబులో నింపుకుని, పంపిణీకి సంబంధించిన ఫొటోలు, వీడియోలను వారి ఎదుటే డిలీట్ చేసి అక్కడ నుంచి జారుకున్నట్లుగా ప్రచారం సాగుతోంది. ఓటర్లకు నగదు ఎరగా వేసి అక్రమంగా ఓట్లను దండుకోవాలని చూస్తున్న చర్యలను అడ్డుకోవాల్సిన పోలీసులే, ఇలా చేతివాటాన్ని ప్రదర్శించడంపై పలు విమర్శలకు తావిస్తోంది. చేతివాటాన్ని ప్రదర్శించిన వారిపై విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలంటూ ప్రజలు కోరుతున్నారు.

తూతూ మంత్రంగా మండల సర్వసభ్య సమావేశం

పాకాల: ఎంపీడీఓ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశాన్ని తూతూ మంత్రంగా నిర్వహించారు. గురువారం ఎంపీపీ లోకనాథం అధ్యక్షతన ఈ సమావేశాన్ని నిర్వహించారు. సర్పంచులు, ఎంపీటీసీలు వచ్చిన వారు వచ్చినట్లే సంతకాలు చేసి తిరుగుముఖం పట్టారు. కేవలం 30 నిమిషాల్లో తూతూ మంత్రంగా సమావేశాన్ని ముగించారు. ఈ సమావేశంలో జెడ్పీటీసీ నంగా పద్మజారెడ్డి, ఎంపీడీఓ నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరిన తిరుచానూరు టీడీపీ యువత



వైఎస్సార్ సీపీలో చేరిన బ్రాహ్మణపట్టు టీడీపీ యువకులు



జగన్నినాదం... మా అభిమతం

- వరుస నంబర్–1.. ఫ్యాన్ గుర్తుకే మా ఓటు
- చంద్రగిరిలో చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి విజయమే లక్ష్యం
- వైఎస్సార్ సీపీలో చేరిన తిరుచానూరు టీడీపీ సానుభూతిపరుల వెల్లడి
- అండగా ఉంటాం.. ఆదరించండి: ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి

తిరుపతి రూరల్: జగన్నినాదమే తమ అభిమతమని, చంద్రగిరి ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి విజయమే లక్ష్యంగా పని చేస్తామని తిరుచానూరు టీడీపీ సానుభూతిపరులు స్పష్టం చేశారు. తిరుచానూరుకు చెందిన 100 మందికి పైగా యువత సర్పంచ్ రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో వైఎస్సార్ సీపీలో చేరారు. గురువారం తుమ్మలగుంట నివాసం వద్ద తుడా చైర్మన్, చంద్రగిరి ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి సమక్షంలో పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి నాయకత్వం వర్ధిల్లాలి అనే నినాదాలతో హోరెత్తించారు. బ్యాలెట్‌లో వరుస నంబర్ – 1.. ఫ్యాన్ గుర్తుకే తమ ఓటు వేయడంతోపాటు అందరికీ చెవిరెడ్డి కుటుంబం సేవా దృక్పథాన్ని తెలియజేసి ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయిస్తామని స్పష్టం చేశారు.

యువత భవితకు భరోసా

తిరుచానూరు టీడీపీ యువత వైఎస్సార్ సీపీలో చేరడం శుభపరిణామం అని చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి అన్నారు. పార్టీ సిద్ధాంతాలు నచ్చి, ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి సేవా గుణాన్ని మెచ్చి, తనపై ఎంతో విశ్వాసంతో పార్టీలోకి విచ్చేసిన ప్రతి ఒక్కరికి పేరు పేరున కృతజ్ఞతలు తెలియజేశారు. పార్టీ కోసం పని చేసేవారికి సముచిత స్థానం ఉంటుందని హామీ ఇచ్చారు. అండగా ఉంటామని.. ఆదరించాలని కోరారు. వైఎస్సార్ సీపీలో చేరిన వారిలో.. మురళీ, శరత్ కుమార్, రాజేష్, చందు, కళ్యాణ్, సాయి, అఖిల్, తరుణ్, బాలాజీ, నరసింహా, రాజేష్, పవన్, వెంకటేష్, తులసి, ఉదయ్, హేమంత్, నాయక్, గణేష్, జానీ, నాగసాయి, వంశీ, అశోక్, బాలాజీ, యుగంధర్, సతీష్, విష్ణు, వెంకీ, నవీన్, మణి , ప్రేమ్, ఢిల్లీ, ఉదయ్, కుమార్, వెంకటేష్, భానుప్రకాష్, వాసు, నాగ, సునీల్, మధు, భాస్కర్ తదితరులు ఉన్నారు. తిరుచానూరు మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ శ్రీధర్ రెడ్డి, సునీల్, లోకేష్, హరి, శరవణ, సూరి, మునికృష్ణ ఉన్నారు.

వైఎస్సార్ సీపీ వైపు... యువత చూపు

తిరుపతి రూరల్ మండలంలో యువత వైఎస్సార్ సీపీ వైపు చూస్తున్నారు. బ్రాహ్మణపట్టు పంచాయతీలో టీడీపీకి చెందిన యువత 20 మంది వైఎస్సార్ సీపీలో చేరారు. గురువారం తుమ్మలగుంట నివాసం వద్ద తుడా చైర్మన్, వైఎస్సార్ సీపీ చంద్రగిరి ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి వారికి కండువాలు కప్పి స్వాగతించారు. పార్టీలో చేరిన యువకులు చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి చిత్రంతో కూడిన టీ షర్టులతో ఆకట్టుకున్నారు. టీడీపీ నుండి వైఎస్సార్ సీపీలో చేరిన వారిలో పవన్‌కుమార్, రూపేష్, ఈశ్వర్, సోము, పెరుమాళ్, దాస్, యశ్వంత్, లోకేష్, సూరిబాబు, హరీష్, సాగర్, మనోజ్, ఈశ్వర్ తదితరులు ఉన్నారు. బ్రాహ్మణపట్టు పంచాయతీ అధ్యక్షుడు కె.ఢిల్లీబాబు తదితరులు పాల్గొన్నారు.

కళాశాలకు కొత్త రూపం



చురుగ్గా సాగుతున్న కళాశాల భవనాల పనులు

- రూ. 2 కోట్లతో ప్రభుత్వ జూనియర్ కళాశాల భవనాల నిర్మాణం

భాకరాపేట: ప్రభుత్వ జూనియర్ కళాశాల భవనాల నిర్మాణాన్ని రూ.2 కోట్లతో చేపట్టినట్లు వలసారెడ్డి శివప్రసాద్‌రెడ్డి తెలిపారు. గురువారం మొదటి దశ భవనాల కాంక్రీటు పనులు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్నగొట్టిగల్లు ప్రభుత్వ హైస్కూల్‌లో తన తండ్రి స్వర్గీయ వలసారెడ్డి సిద్ధరామిరెడ్డి (మాజీ జిల్లా పరిషత్ చైర్మన్) ఇక్కడే చదువుకున్నారన్నారు. ఆయన బిడ్డలంతా ఇక్కడ పాఠశాలలోనే చదువుకున్నామన్నారు. అయితే 1984లో ప్రభుత్వ కళాశాల వస్తే అప్పటి నుండి హైస్కూల్ భవనాల్లోనే కళాశాల కొనసాగుతోందన్నారు. వలసారెడ్డి సిద్ధరామిరెడ్డి పేరు మీద కళాశాలకు అవసరమైన 7 తరగతి గదులు, 6 ల్యాబ్ గదులు అందుబాటులోకి తీసుకురానున్నట్లు తెలిపారు. ఇందుకు అవసరమైన రూ.2 కోట్లు తమ స్వంత నిధులతో నిర్మాణం చేపట్టామన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాఠశాలలకు ఇచ్చిన ప్రాధాన్యం, ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి చేపట్టిన అభివృద్ధి పనుల స్ఫూర్తితో కళాశాల భవనాలు నిర్మిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సర్పంచ్ మనోహర్, మాజీ సర్పంచ్ భాస్కర్‌రెడ్డి, జేసీఎస్ కన్వీనర్ ఖదీర్‌అహ్మద్, విద్యానికేతన్ స్కూల్ కరస్పాండెంట్ పాపిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రీపోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి

రామచంద్రాపురం: రీపోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎన్నికల పరిశీలకుడు కైలాస్ వాంఖడే అధికారులను ఆదేశించారు. గురువారం మండలంలోని ఎన్‌ఆర్ కమ్మపల్లి, సీకాలేపల్లి, కుప్పంబాదూరు, కొత్తకండ్రిగ గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన పోలింగ్ కేంద్రాలలోని మౌలిక వసతులను తనిఖీ చేశారు. అనంతరం మాట్లాడుతూ పోలింగ్ కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా, తగినంత పోలీసు బందోబస్తుతో ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించాలన్నారు. ఎన్నికల రోజున గ్రామాల్లో వివాదాలు సృష్టించే వ్యక్తులను పోలీసులు ముందే గుర్తించి అదుపులోకి తీసుకోవాలని చెప్పారు. హింసాత్మక ఘటనలు, రీపోల్‌కు తావు లేకుండా కేంద్ర బలగాలు, రాష్ట్ర పోలీస్ బలగాలు, మైక్రో అబ్జర్వర్ ఏర్పాటు, వెబ్ క్యాస్టింగ్, వీడియోగ్రఫీ తదితర ఏర్పాట్లతో పర్యవేక్షిస్తామని పేర్కొన్నారు. పోలింగ్ కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు, ర్యాంపు, తాగునీరు, మరుగుదొడ్లు పక్కాగా ఉండాలని ఆదేశించారు. తహశీల్దార్ ఉషారాణి, ఎస్ఐ చిరంజీవి, ఆర్ఐ కృష్ణమ్మ, రెవెన్యూ సిబ్బంది చిరంజీవి, బాబుఖాన్ తదితరులు పాల్గొన్నారు.



పోలింగ్ కేంద్రాన్ని ఎన్నికల పరిశీలకుడు కైలాస్ వాంఖడే

ఫ్యాను గుర్తుపై ఓటు వేసి మోహిత్‌ను గెలిపించండి

- మోసపూరిత హామీలను నమ్మకండి
- మంచి చేసే వారికే ఓటు వేయండి
- ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి సతీమణి చెవిరెడ్డి లక్ష్మి



ప్రచారంలో పాల్గొన్న చెవిరెడ్డి లక్ష్మి

పాకాల: ఫ్యాను గుర్తుపై ఓటు వేసి మీ బిడ్డ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డిని ఆశీర్వదించి ఎమ్మెల్యేగా గెలిపించాలని చంద్రగిరి ఎమ్మెల్యే డాక్టర్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి సతీమణి చెవిరెడ్డి లక్ష్మి పేర్కొన్నారు. గురువారం మండలంలోని దామలచెరువు సందు వీధి, జనప వీధి, మసీదు వీధి, మక్కాన్ వీధి, రెడ్డివారి వీధి, ఉప్పువంక, మౌలాలిపేట, ఆజాద్‌నగర్, మ్యాంగోనగర్‌లలో మన ఊరికి మన మోహిత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. స్థానిక నాయకులు చెవిరెడ్డి లక్ష్మికి గజమాలలు వేసి, శాలువాలు కప్పి, మంగళ హారతులతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో జగనన్న పాలన ఉంటేనే బడుగు బలహీన వర్గాలకు మేలు జరుగుతుందని, రాష్ట్రం కూడా అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు. చంద్రగిరి నియోజకవర్గంలో ఎమ్మెల్యే చేసిన అభివృద్ధి గతంలో ఏ రాజకీయ పార్టీ చేయలేదని, తుడా చైర్మన్‌గా మోహిత్‌రెడ్డి కోట్ల రూపాయల నిధులతో ప్రతీ పంచాయతీని అభివృద్ధి చేశారని గుర్తు చేశారు. ప్రజలు, కార్యకర్తలు అందరూ తమ కుటుంబ సభ్యులేనని, ఎవ్వరికి ఏ కష్టం వచ్చినా అందుబాటులో ఉంటామని పేర్కొన్నారు. కేవలం ఎన్నికల సమయంలో మాత్రమే కనిపించి, మిగిలిన సమయంలో కనిపించకుండా పోయే నాయకులు కాదని గుర్తు చేశారు. టీడీపీ నాయకులు ఇచ్చిన హామీలు ఏ నాడు నెరవేర్చలేదని, ఈ విషయాలను ప్రజలు గుర్తుంచుకోవాలని పేర్కొన్నారు. తండ్రి బాటలో నడుస్తూ, తండ్రికి తగ్గ తనయుడిగా ప్రజా సేవకు అంకితమైన తన బిడ్డ మోహిత్‌రెడ్డిని ఆశీర్వదించి చంద్రగిరి ఎమ్మెల్యేగా గెలిపించాలని పేర్కొన్నారు. ప్రజలందరూ చేసిన మంచిని గుర్తుంచుకోవాలని, రాబోయే కాలంలో మరింత అభివృద్ధి చేసుకునేందుకు ఫ్యాను గుర్తుపై ఓటు వేసి వైఎస్సార్ సీపీని గెలిపించుకుందామని పిలుపునిచ్చారు.



చెవిరెడ్డి లక్ష్మిని గజమాలతో సత్కరిస్తున్న నాయకులు

చంద్రగిరిలో పరాకాష్టకు చిత్తూరు రౌడీయిజం

- ప్రశాంత చంద్రగిరిలో అమాయకులపై వరుస దాడులు
- మారణాయుధాలతో సంచరిస్తున్న చిత్తూరు గూండాలు
- ప్రశాంత జీవనానికి అలవాటు పడిన ప్రజానీకంలో భయాందోళనలు
- చర్యలు తీసుకోవాలని అర్థిస్తున్న చంద్రగిరి ప్రజలు



గాయాలను చూపుతున్న లవంత్ రెడ్డి

పాకాల: చంద్రగిరి నియోజకవర్గంలో చిత్తూరు తరహా రౌడీయిజం పరాకాష్టకు చేరుకుంది. చిత్తూరు నుంచి దిగుమతి అయిన టీడీపీ నేత కనుసన్నల్లో గూండాలు వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలపై విచక్షణా రహితంగా దాడులకు తెగబడుతున్నారు. నేరాలు చేయడంలో రాటుదేలిన చిత్తూరు గూండాలు నామినేషన్ దాఖలు ఆఖరు రోజు సాక్షాత్తు ఎమ్మెల్యేపైనే దాడి చేయడానికి బరితెగించారు. ఈ ఘటన ప్రశాంతంగా ఉండే చంద్రగిరి నియోజకవర్గాన్ని ఒక్కసారిగా భయభ్రాంతులకు గురి చేసింది. గతంలో కూడా రామానుజపల్లిలో కొందరిపై చిత్తూరు గూండాలు దాడి చేసి గాయపరిచారు. ఇటీవలే రంగంపేటలో ఒకరిపై కత్తితో దాడి చేసి గాయపరిచారు. కొద్దిరోజుల క్రితం కుంట్రపాకం మాజీ సర్పంచ్ బుజ్జిరెడ్డి తనయుడు అవినాష్‌రెడ్డిపై కత్తితో దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. ఇలా వరుస దాడులకు తెగబడుతుండడంతో చంద్రగిరిలో ప్రశాంతత కరువై భయానక వాతావరణం చోటుచేసుకుంటోంది. ఆధ్యాత్మికత మేళవించిన నియోజకవర్గంలో అమాయకులపై చిత్తూరు గూండాల వరుస దాడులు, అసాంఘిక చర్యలు పరాకాష్టకు చేరుకున్నాయి. ఎన్నికల సమయంలో అల్లర్లు సృష్టించి ఓటర్లను భయభ్రాంతులకు గురిచేసేందుకు చిత్తూరు నుంచి దిగుమతి అయిన నేత అరాచక శక్తులను వందల సంఖ్యలో చంద్రగిరిలో తిష్ట వేయించినట్లు సమాచారం. చిత్తూరు నేత అరాచకాలను ఎన్నికల అధికారులైనా అదుపు చేయాలని చంద్రగిరి ప్రజానీకం దయనీయ స్థితిలో అర్థిస్తోంది.

తాజాగా మరో దాడి

ఈ అరాచకాల నేపథ్యంలో శుక్రవారం వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ కుమారుడిపై చిత్తూరు రౌడీలు సినీఫక్కీలో దాడికి తెగబడ్డారు. శుక్రవారం రాత్రి మండల కన్వీనర్ నంగా నరేష్‌రెడ్డి కుమారుడు లవంత్‌రెడ్డి తన స్నేహితుడిని పంటపల్లె నుంచి దేశిరెడ్డిపల్లె వద్ద బైక్‌పై వెళ్లి వదిలేసి తిరుగు పయనమయ్యాడు. దేశిరెడ్డిపల్లెకి సమీపంలోని రైల్వే గేటు వద్ద కాపుకాసిన గూండాలు ముఖాలకు మాస్కులు ధరించిన దుండగులు దాడికి తెగబడ్డారు. బ్లేడ్‌లు, కత్తులతో పొట్ట, ఇతర శరీర భాగాలపై 18 చోట్ల దాడి చేసి గాయపరిచారు. భయంతో లవంత్‌రెడ్డి వేసిన కేకలకు చుట్టుపక్కల వారు చేరుకోవడంతో చిత్తూరు గూండాలు పలాయనం చిత్తగించారు. అనంతరం రక్తగాయాల పాలై షాక్‌లో ఉన్న లవంత్‌రెడ్డిని ఆస్పత్రికి తరలించారు. దీనిపై పోలీసు అధికారులు చర్యలు తీసుకోవాలని బాధితులు, వైఎస్సార్ సీపీ నేతలు కోరుతున్నారు.

పోలింగ్‌కు సర్వం సిద్ధం

- 397 పోలింగ్ కేంద్రాలు... 3.15 లక్షల మంది ఓటర్లు
- పోలింగ్ విధుల్లో 3 వేల మంది సిబ్బంది
- 1000 మంది పోలీసులతో భద్రత
- వెటర్నరీ వర్సిటీలో రిసెప్షన్ సెంటర్
- పద్మావతి మహిళా వర్సిటీలో స్ట్రాంగ్ రూమ్
- 3,630 మంది పోస్టల్ బ్యాలెట్ వినియోగం
- ప్రతి పోలింగ్ స్టేషన్‌లో వెబ్‌క్యామ్ ద్వారా పర్యవేక్షణ
- 202 పోలింగ్ కేంద్రాలు అత్యంత సమస్యాత్మకం
- 146 మందికి హోం ఓటింగ్
- చంద్రగిరి రిటర్నింగ్ అధికారి నిషాంత్‌రెడ్డి వెల్లడి



మాట్లాడుతున్న చంద్రగిరి ఆర్‌ఓ నిషాంత్‌రెడ్డి

తిరుపతి రూరల్: చంద్రగిరి నియోజకవర్గం పరిధిలో పోలింగ్‌కు ముమ్మర ఏర్పాట్లు చేస్తున్నట్లు రిటర్నింగ్ అధికారి నిషాంత్‌రెడ్డి తెలిపారు. గురువారం తిరుపతిలోని ఆర్డీఓ కార్యాలయంలోని రిటర్నింగ్ ఆఫీసర్ ఛాంబర్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో మొత్తం 397 పోలింగ్ స్టేషన్ల పరిధిలో 3.15 లక్షల మంది ఓటర్లు ఉన్నట్లు తెలిపారు. ఈ నెల 13వ తేదీన జరిగే సార్వత్రిక ఎన్నికల పోలింగ్‌కు సంబంధించి 460 మంది పోలింగ్ ఆఫీసర్లు, 460 అసిస్టెంట్ పోలింగ్ ఆఫీసర్లు, 1600 మంది ఇతర పోలింగ్ సిబ్బంది, 330 మంది మైక్రో అబ్జర్వర్లు, 66 సెక్టోరియల్ ఆఫీసర్లు పోలింగ్ విధుల్లో ఉంటారన్నారు. పోలింగ్ విధుల్లో పాల్గొనే సిబ్బందికి ఈవీఎం, పోలింగ్ మెటీరియల్ అందించేందుకు తిరుపతిలోని శ్రీవెంకటేశ్వర వెటర్నరీ వర్సిటీలో రిసెప్షన్ సెంటర్‌ను ఏర్పాటు చేశామన్నారు. ఈ నెల 12వ తేదీ ఉదయం వర్సిటీలో ఏర్పాటు చేసిన 25 కౌంటర్ల ద్వారా సిబ్బందికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా మెటీరియల్ అందిస్తామన్నారు.

146 మందికి హోం ఓటింగ్

నియోజకవర్గం పరిధిలో 148 మంది హోం ఓటింగ్‌కు దరఖాస్తు చేసుకున్నారని, అందులో ఇద్దరు చనిపోయారని, 146 మంది హోం ఓటింగ్‌ను వినియోగించుకున్నట్లు ఆర్‌ఓ నిషాంత్‌రెడ్డి తెలిపారు. నియోజకవర్గం వ్యాప్తంగా 3,630 మంది పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకుని, ఓటింగ్‌లో పాల్గొన్నట్లు చెప్పారు. ఎక్కడా ఇబ్బందులు లేకుండా పోస్టల్ బ్యాలెట్ ప్రక్రియను పూర్తి చేశామన్నారు.

202 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు

చంద్రగిరి నియోజకవర్గంలో 397 పోలింగ్ కేంద్రాలు ఉంటే అందులో 202 కేంద్రాలను అత్యంత సమస్యాత్మక కేంద్రాలుగా గుర్తించినట్లు ఆర్‌ఓ నిషాంత్‌రెడ్డి తెలిపారు. గతంలో రీ-పోలింగ్ జరిగిన కేంద్రాలు, బలహీన వర్గాలను ఓట్లు వేయించకుండా అడ్డుకున్నారనే ఉదంతాల నేపథ్యంలో 15 పోలింగ్ కేంద్రాలను అత్యంత సమస్యాత్మక కేంద్రాలుగా గుర్తించి, కేంద్ర, రాష్ట్ర భద్రతా బలగాలతో భద్రత కల్పిస్తున్నట్లు చెప్పారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో లైవ్ వెబ్ క్యామ్ ద్వారా పోలింగ్ ప్రక్రియను రికార్డు చేసి పర్యవేక్షించనున్నట్లు పేర్కొన్నారు. పోలింగ్ సిబ్బందితో దురుసుగా ప్రవర్తించినా, ఎన్నికల ఏజెంట్లు వారిలో వారు కొట్లాడినా, ఓటర్లను బెదిరించినా ఎన్నికల కమిషన్ సీరియస్‌గా చర్యలు తీసుకుంటుందన్నారు. ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద వీడియో రికార్డింగ్ ఉంటుందన్నారు. సెక్టోరియల్ ఆఫీసర్లకు మెజిస్ట్రీయల్ పవర్స్ ఉంటాయని, ఎక్కడికక్కడ చర్యలు తీసుకుంటారని తెలిపారు. నియోజకవర్గం పరిధిలో ఎన్నికలకు సంబంధించి ఎలాంటి సమస్య ఉన్నా 94910 77012 నెంబర్‌కు కాల్ చేయాలని ఆర్‌ఓ తెలిపారు. పోలింగ్ ముగిసే సమయానికి 48 గంటల ముందు రాజకీయ పార్టీలు తమ ప్రచారాన్ని ముగించాల్సి ఉంటుందన్నారు. అంటే ఈ నెల 11వ తేదీ సాయంత్రం 6 గంటలకు ప్రచారం ముగించాలన్నారు.

14 లక్షల నగదు... 5,242 లీటర్ల మద్యం స్వాధీనం

ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన నాటి నుంచి చంద్రగిరి నియోజకవర్గం పరిధిలో ఎలాంటి రికార్డులు చూపని రూ.14.07 లక్షల నగదు, 5,242 లీటర్ల మద్యం స్వాధీనం చేసుకున్నట్లు ఆర్‌ఓ తెలిపారు. మరో 120 వివిధ రకాల వస్తువులను సీజ్ చేశామన్నారు. ఎన్నికల కోడ్‌ను అతిక్రమించిన వారిపై 52 కేసులు నమోదు చేశామన్నారు.

హోంమంత్రిపై పచ్చమూకల దాడి దుర్మార్గం

తిరుపతి కల్చరల్: ఎన్నికల పోటీల్లో ప్రజల ఆదరణ కానరాకపోవడంతో ఓటమి భయంతో పచ్చమూకలు హోంమంత్రి తానేటి వనితపై దాడికి పాల్పడడం దుర్మార్గమని వైఎస్సార్ సీపీ ఎస్సీ విభాగం రాష్ట్ర కార్యదర్శి మల్లారపు మధు ఒక ప్రకటనలో తెలిపారు. నిత్యం దోపిడీతో పాలించిన చంద్రబాబును ప్రజలు విస్మరించడాన్ని సహించలేక అధికార పార్టీ నేతలపై దాడులకు ఉసిగొల్పడం చేతకానితనానికి నిదర్శమని పేర్కొన్నారు. దుర్మార్గపు పచ్చమూకలు హోం మంత్రిపైనే దాడికి బరితెగించి దాడి చేస్తే ఇక చంద్రబాబు పాలనలో సామాన్యుల పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. విలువలు విస్మరించి ప్రజాస్వామ్యానికి విరుద్ధంగా వ్యవహరిస్తున్న కూటమి ప్రజాగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు.

శ్రీవారి సేవలో సీనియర్ ఐఏఎస్ అధికారి

తిరుమల: తిరుమల శ్రీవారిని గురువారం సీనియర్ ఐఏఎస్ అధికారి అనిల్‌కుమార్‌సింగాల్ దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ అధికారులు ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. శ్రీవారి దర్శనానంతరం ఆలయ రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనాలు అందించగా.. టీటీడీ అధికారులు ఘనంగా లడ్డూ ప్రసాదాలతో సత్కరించారు.